ఉరేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్

● సీపీఆర్ చేసి కాపాడిన పోలీసులు



జగన్‌కు సీపీఆర్ చేస్తున్న పోలీసులు

సరూర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.. ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకోవడానికి అంతా సిద్ధం చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్ చేశాడు.. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడకు చేరుకుని కొనఊపిరితో ఉన్న సదరు వ్యక్తిని సీపీఆర్ చేసి కాపాడారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం... బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌కు చెందిన జగన్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. శనివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు లుంగీ కట్టి ఉరేసుకోవడానికి సిద్ధపడి డయల్ 100కు ఫోన్ చేశాడు. అక్కడి సిబ్బంది మీర్‌పేట్ పోలీసులకు సమాచారంతో పాటు లొకేషన్‌ను పంపించడంతో కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, రమావత్ రవి, నాగరాజు, హోంగార్డు నర్సింహ సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే జగన్ ఉరేసుకోగా, కిందకు దింపి సీపీఆర్ చేశారు. తరవాత ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని, కోలుకుంటున్నాడని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ చెప్పారు. జగన్‌ను కాపాడిన పోలీసులకు అతడి కుటుంబసభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. రాచకొండ కమిషనర్, ఇతర పోలీసు అధికారులు వారిని అభినందించారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

యుసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాత్రి హాస్టల్ ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనం చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా నంద్యాల నూనెపల్లి ప్రాంతానికి చెందిన డి.ఇమామ్‌వలి నగరంలోని ఎస్‌ఆర్‌నగర్ వెస్ట్‌లోని అమృత సాయి లగ్జరీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే ఈ నెల 8వ తేదీ రాత్రి పది గంటలకు తన బైక్‌ను హాస్టల్‌వద్ద పార్క్ చేశాడు. అయితే ఉదయం 9 గంటలకు వచ్చి చూడగా తన బైక్ కనిపించలేదు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రౌడీషీటర్ తన్నూ ఖాన్‌పై కేసు

యుసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నాలాపై రేకుల షెడ్ వేసి దానిలో పలు రకాల పక్షులు, జంతువులు పెంచుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రౌడీ షీటర్ మొహ్మద్ తన్వీర్ ఖాన్ అలియాస్ తన్నూఖాన్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ తవక్కల్‌నగర్‌కు చెందిన తన్నూఖాన్ నిమ్రా అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న వరనీటి నాలాపై రేకులషెడ్ నిర్మించి దానిలో గొర్రెలు ఆవులు, కోళ్లు, బాతులు తదితర జీవులను పెంచటంతో పాటు అక్కడ క్యారమ్‌బోర్డు, జిమ్ పెట్టి స్థానికంగా కుర్రాళ్లను పోగు చేస్తున్నాడు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఖైరతాబాద్ సర్కిల్-17 ఉప పట్టణ ప్రణాళిక అధికారి అబ్దుల్ ఫహీమ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో రౌడీ షీటర్ తన్నూఖాన్‌పై పలు సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు. కాగా తన్నూ ఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.



రాజీవ్‌నగర్‌లోని పార్కులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కాలనీవాసులు, మైత్రి వాకర్ అసోసియేషన్ సభ్యులు

కాలనీల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎర్రగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి కాలనీల పరిశుభ్రతకు కృషి చేయాలని మైత్రి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయానంద్ అన్నారు. ఆదివారం రాజీవ్‌నగర్ కాలనీలోని పార్కులలో మైత్రివాకర్స్ అసోసియేషన్, హరిత ఫౌండేషన్, రాజీవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘంల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కృష్ణశర్మ, అధ్యక్షులు వినయసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, అర్చన, రఘురాం గౌడ్, శాస్త్రి, భాస్కర్, రామాయన్, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్న పార్టీతోనే అభివృద్ధి

బోరబండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీతో బస్తి సమస్యలు పరిష్కారమై అభివృద్ధి చెందుతాయని మధురానగర్ సంక్షేమ సంఘం ఛైర్మన్ వీరయ్య, అధ్యక్షులు దేవేందర్ అన్నారు. మధురానగర్ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం మధురానగర్‌లో జరిగింది. ఆరు గ్యారంటీలు, ఉచిత కరెంట్ ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంక్షేమ సంఘం కృతజ్ఞతలు చెప్పింది. కార్యక్రమంలో బబ్లూ, మహేష్, శంకర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి వెళ్లిన యువతి అదృశ్యం

యుసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పండుగ రోజు ఉపవాసం ఉండి మరుసటి రోజు ఉదయం శివాలయానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ వెల్లంకిఫుడ్స్ వెనుక వైపు ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న దంపతులకు ఒక కూతురు(16) ఉంది. ఆ యువతి శివరాత్రి రోజు ఉపవాసం ఉంది. మరుసటి రోజు ఉదయం 10.30గంటల సమయంలో శివాలయానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. సాయంత్రం ఆరు గంటలకు కూడా తిరిగి రాకపోవటంతో చుట్టపక్కల వెతికినా ఫలితం లేక మధురనగర్ పోలీసులకు ఆమె తల్లితండ్రులు ఫిర్యాదు చేశారు. కాగా గతంలో ఆ యువతి ఒకసారి అంబాదాస్ అనే వ్యక్తితో వెళ్లిందని, ఆ విషయమై అప్పట్లో కూడా ఫిర్యాదు చేశామని, మళ్లీ అతనే తమ కుమార్తెను తీసుకువెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్‌లో..

యుసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌హోమ్‌లో ఉంటున్న ఓ యువతి కోచింగ్ కోసం వెళ్లి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ స్టేట్‌హోమ్‌లో ఉంటున్న లాలిబాయ్ అనే యువతి ఈ నెల 9న ఈసిఈటి కోచింగ్ కోసం ఉదయం 8.45గంటలకు దిల్‌సుక్‌నగర్‌కు బయలుదేరింది. కోచింగ్ పూర్తయిన తరువాత అందరూ తిరిగి వచ్చారు. కానీ, లాలిబాయ్ తిరిగి రాలేదు. మిగతా వారిని అడగగా మాకు కనిపించలేదని తెలిపారు. దీంతో స్టేట్‌హోమ్ సర్వీస్ వాచ్‌మెన్ నర్సింగరావు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు..

యుసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ చేసి సిగరెట్ తాగటానికి పక్కకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ సంజయ్‌గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో నివాసం ఉండే రమేష్ అనే వ్యక్తి వాచ్‌మెన్ డ్యూటీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన సొంతూరైన పశ్చిమ గోదావరి జిల్లా ద్వారంపూడి దగ్గరలోని వల్లూరు ఎస్సీ పేటకు తన తల్లిదండ్రులతో కలిసి వెళ్లాడు. అయితే ఈ నెల 4న రైలుఎక్కి నగరానికి తిరిగి వస్తూ రైల్వేస్టేషన్ నుంచి బస్సులో అమీర్‌పేట సోనాబాయి దేవాలయం వద్ద దిగాడు. ఎల్లారెడ్డిగూడ క్రాస్ రోడ్డు వద్ద వారు టిఫిన్ తిన్నారు. అయితే తన తండ్రి సత్యనారాయణ సిగరెట్ తాగటానికి పక్కకి వెళ్లి ఎంత సేపటికి తిరిగి రాకపోవటంతో ఇంటికి వెళ్లి ఉంటాడని ఇంటికి వెళ్లి చూసినా కనిపించలేదు. దీంతో మధురానగర్ పోలీసులకు రమేష్ ఫిర్యాదు చేశాడు. తన తండ్రి పక్షవాతం రోగి అని, కాలు, చేయి సరిగా పని చేయవని, ఆయన వద్ద ఫోన్ కూడా లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్సార్టీనగర్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిలో కాలనీవాసులు



ఎర్రగడ్డలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి

బోరబండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భారత తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు శివశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎస్సార్టీ నగర్‌లో సాయిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్దార్, రమేష్, దేవమ్మ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి రవిగౌడ్ కొనియాడారు. సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఎర్రగడ్డలో ఆమె చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ నాయక్, మోసిన్ ఖురేషి, ఆకాష్, గణేష్, యాకమ్మ, అలేఖ్య సుధా, బేబీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అతిథి అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీఎల్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కిషోర్ కుమార్ తదితరులు

పంజాగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సభ్యుడు జి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం (టీ.డి.ఎల్.ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతల కిషోర్ కుమార్ అధ్యక్షతన ఆదివారం ఖైరతాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో చేర్చినందుకుగాను కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్రస్థాయి అభినందన సమావేశం జరిగింది. ప్రతి సంవత్సరం ఇంటర్వ్యూలు లేకుండానే ప్రస్తుతం పనిచేస్తున్న, పాత వారినే 2024, 2025 విద్యా సంవత్సరంలో రెన్యూవల్ అయ్యే విధంగా చొరవ తీసుకుంటానని హర్షవర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. కొత్త నియామకాల్లో గతం నుంచి పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు వేయిటేజిని ఇవ్వాలని సోషల్ డెమోక్రటిక్ ఫోరమ్ కో-కన్వీనర్ ఎస్.పృథ్వీరాజ్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం 58,850 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతల కిషోర్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 135 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1940 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వెంకటేశ్వరరావు, డాక్టర్ సంతోష్, శ్రీనివాస్, కరుణాకర్, సుకీర్తి, సుభాషిణి పాల్గొన్నారు.



మెడల్స్‌తో రెజ్లర్లు

గురుకులాల రెజ్లర్లకు 14 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు పది స్వర్ణాలు, 4 రజతాలు సహా మొత్తం 14 పతకాలు కొల్లగొట్టారు. రెండ్రోజులుగా యాకత్‌పురాలో జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. సచిన్, ప్రకాష్, ధర్మతేజ, విక్రమ్, నదిత్‌రాజ్, ఉపేందర్, వికాస్ లావణ్య, శిరీష, రిషిత, ప్రణీత స్వర్ణాలు, అక్షయ్, అర్చన, సృజన, సంతోషి రజత పతకాలు సాధించారు. వీరిని గురుకులాల క్రీడాధికారి రామ్‌లక్ష్మణ్ అభినందించారు.



పోటీల్లోని దృశ్యం

ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-3ను హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఓటమితో ముగించింది. ఈ సీజన్ ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ 0-3తో కొచ్చి బ్లూ స్పైకర్స్ చేతిలో ఓడి, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. హైదరాబాద్ 12-15, 12-15, 11-15తో వరుస సెట్లలో పరాజయం పాలైంది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఆడిన ఎనిమిదింట్లో ఒక్క మ్యాచ్‌లోనే గెలవడం గమనార్హం.

16 నుంచి పికిల్‌బాల్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 16, 17వ తేదీల్లో మాదాపూర్‌లోని గేమ్ పాయింట్‌లో పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నారు. పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, 35 ప్లస్ కేటగిరీలో పోటీలు జరుపుతున్నారు. ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. మరిన్ని వివరాల కోసం 7032777333లో తెలుసుకోగలరు.



ప్రొఫెసర్ హరగోపాల్ కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

నిమ్న వర్గాల జీవన ప్రమాణాలను పెంచాలి

ఖైరతాబాద్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జీవన విధానాలు మెరుగు పరచేలా చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ హర గోపాల్ అన్నారు. ఆదివారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ల సమస్యలపై ఆలిండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య భవన్ లో జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. తన పేరుతో పార్టీలు, సంఘాలు పెట్టిన వాళ్లంతా తన వారసులు కాదని, తన సిద్ధాంతాన్ని ఆచరించి అనుసరించినవాళ్లే నిజమైన వారసులని డాక్టర్ అంబేడ్కర్ అన్నారని గుర్తు చేశారు. సదస్సులో నిర్వాహక సంస్థ అధ్యక్షులు మురళీధర్‌రావు, విశ్రాంత ఐఏఎస్ శ్రీనివాసులు, ప్రతినిధులు పి జె సుధాకర్, నారాయణ, మహేశ్వర్ రావు పీవీ రమణ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు

7,150 మంది పిల్లలకు గుండె సర్జరీలు

● హృదయ ఫౌండేషన్‌ను అభినందించిన జయేష్‌రంజన్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు గుండె సర్జరీలో చేయూత అందిస్తున్న హృదయ ఫౌండేషన్‌ను కార్పొరేట్లు, ఐటీ కార్పొరేట్ రంగాలు ప్రోత్సహించాలని ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. టీ హబ్ వద్ద శనివారం రాత్రి హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,150 సర్జరీలను పూర్తి చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి వ్యవస్థీకృత మద్దతు అందించడం అవసరమన్నారు. 2005లో 'హృదయ క్యూర్ ఎ లిటిల్ హార్ట్'ను డాక్టర్ గోపీచంద్ మన్నంతో పాటు ఇతర భావాలు గల వ్యక్తులు స్థాపించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. జైరాజ్‌కుమార్, డాక్టర్ నాగార్జున పొనుగోటి నేతృత్వంలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడే వారందరికీ సహకరిస్తున్నారన్నారు. హృదయ ఫౌండేషన్, స్టార్, ఇన్నోవా ఆస్పత్రుల్లో 7,150 మందికి పైగా పిల్లలకు వైద్య చికిత్సలు పొందేందుకు సహాయం చేసిందన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే ఉన్నతస్థాయికి!



కార్ఖానాలో మేధావులతో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి తనకు మల్కాజిగిరితో సంబంధమేంటని అంటున్నారని.. తాను ఒక కులానికో, ప్రాంతానికో, మతానికో సంబంధించిన వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డగా, ప్రజల ఆశీర్వాదంతో ఉన్నత స్థాయికి వచ్చిన వాడినని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం కార్ఖానాలో ఆదివారం మేధావులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీఎం మాటలపై ఆయన స్పందించారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వారికి ముందుంది ముసళ్ల పండగ అని అన్నారు. నా రాజకీయ జీవితంలో ఏ నాయకుడిపై, ఏ పార్టీపై వ్యక్తిగత దూషణలు చేయలేదని, సంస్కారం ఉన్న వాడినని అన్నారు. రాజకీయ నాయకులు ఉన్నతంగా ఉండాలని, సంకుచితంగా ఉండే వాళ్లు నాయకులు కాదన్నారు. చిన్న, కురస నాయకుల గురించి మాట్లాడనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలై ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. మల్కాజిగిరిలో సమస్యల పరిష్కారం కోసం వచ్చానని పేర్కొన్నారు. నగరంలో ఫ్లైఓవర్లన్నీ కేంద్ర నిధులతో నిర్మిస్తున్నవేనని అన్నారు.

నిస్వార్థపరులకే ప్రజలు ఓటు వేస్తారు

మారేడ్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంకీర్ణ ప్రభుత్వాలకు ఆస్కారం లేదని మాజీ మంత్రి బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మహేంద్రహిల్స్ త్రిమూర్తికాలనీలో సీనియర్ నాయకులు వి.నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 273 సీట్లు ఇచ్చి సంకీర్ణ రాజకీయాల శిఖరానికి పాతర వేసి ఒక స్టేబుల్ గవర్నమెంట్ అందించిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన ఘనత, అయోధ్య రామమందిర నిర్మాణంలో నరేంద్రమోదీ చట్టాలను, వర్గాలను గౌరవిస్తూ, తీసుకున్న నిర్ణయం ప్రపంచ దేశాలు సైతం ప్రశంసించాయని ఆయన తెలిపారు. కరోనా తొలిదశలో మహేంద్రహిల్స్ నివాసికి రావడం కలకలం రేపిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి రాష్ట్రానికి అనేక సేవలు అందించినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన గ్యారెంటీలన్నీ అందించాలని కోరారు. తాను ఎప్పుడు ఏ ఒక్క నాయకుడిని విమర్శించలేదని తెలిపారు. మాజీ సీఎం గంటల తరబడి స్పీచులు ఇస్తూ తానే అంతా చేస్తున్నానంటూ చెప్పుకున్న ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించిన విషయాన్ని మర్చిపోవద్దని హెద్దేవా చేశారు. ప్రధాని మోదీ మనదేశం, మన అభివృద్ధి అంటూ అనేక పెద్ద నగరాలకు వేల కోట్లలో నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని కొనియాడారు. అధిక జనాభా కలిగిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు శ్రీగణేష్, వి.నర్సింగరావు, టోపి శంకర్, విజయానంద్, భానుక మల్లికార్జున్, వీరయ్య, డాక్టర్ బీటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహేంద్రహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్



జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపీనాథ్

బస్తీలోని సమస్యల పరిష్కారానికి కృషి

బోరబండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బస్తీ సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. ఆదివారం బోరబండ మధురానగర్‌లో పార్టీ నాయకులతో కలసి ఆయన పర్యటించారు. బస్తీలో తాగునీటి సమస్య, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించాలని ఎమ్మెల్యేకి ఆనంద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ఎస్పీఆర్ హిల్స్ రిజార్వాయర్ నుంచి భారత్‌నగర్ మీదుగా మధురానగర్‌కు తాగునీటి పైప్‌లైన్‌లను అనుసంధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్.విజయ్‌కుమార్, సాయిచరణ్, వసీం, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ..

ఎర్రగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకొని ఎర్రగడ్డ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి ఏర్పాటుచేసిన నిత్యవసరాలను జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదివారం ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు సంజీవ, నాయకులు షేక్ జావేద్, జానీ మియా, నయీమ్ ఖాన్, మహమ్మద్ అజీమ్, సయ్యద్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి.. నిర్మాణాలు చేపడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

● రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో క్రిమినల్ కేసు

బంజారాహిల్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న బీఆర్‌ఎస్ నాయకులపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. హకీంపేట విలేజ్ షేక్‌పేట మండలం పరిధిలోని వినాయకనగర్, దీన్‌దయాళ్‌నగర్ బస్తీలకు అనుకొని లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంపై కన్నేసిన బీఆర్‌ఎస్ నాయకులు అల్లాడి రమణ, నాగేశ్వర్‌రావు ఓ పథకం ప్రకారం కబ్జాకు తెర తీసారు. మొదట స్థలాన్ని చదును చేసి పిల్లర్లు, పక్కా నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు కొద్ది రోజుల క్రితం కూల్చివేతలు చేపట్టి ఇద్దరిని హెచ్చరించారు. కానీ సదరు నాయకులు పట్టించుకోకుండా తాజాగా నిర్మాణాలు చేయడం మొదలు పెట్టారు. మరోసారి నిర్మాణాలను అడ్డుకున్న ఎంఆర్ఐ భీసింగ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని కాపాడేందుకు పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు రమణ, నాగేశ్వరరావుపై 447, 427 ఐపీసీ కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి



అవగాహన పరుగును ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీసీపీ అశోక్, బ్యాడ్మింటన్ స్టార్ సాయిప్రణీత్

ఖైరతాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో మెదడుకు గాయాలు కావడంవల్ల ప్రతి యేటా లక్షన్నర మరణాలు సంభవిస్తుండగా 5 లక్షల మందికి పైగా తీవ్రంగా గాయపడి జీవితాంతం ఇబ్బందులు పడుతున్నారని పలువురు ప్రముఖులు ఆందోళన వ్యక్తంచేశారు. తలకయ్యే గాయాలపై అవగాహన కోసం ఆదివారం నెక్లెస్‌రోడ్డులోని సంజీవయ్యపార్కు నుంచి పరుగు నిర్వహించారు. నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత సాయిప్రణీత్ అవగాహన పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ కేవీఆర్ శాస్త్రి, కార్యదర్శి ప్రొఫెసర్ మానస్ పాణిగ్రాహి, నిమ్స్‌ఆస్పత్రి న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ భట్టాచారి పాల్గొన్నారు.

మాదిగలకు మూడు ఎంపీ స్థానాలు కేటాయించాలి

పంజాగుట్ట, మార్చి10(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు రెండు ఎస్సీ రిజర్వ్‌డ్, ఒక జనరల్ స్థానం కేటాయించాలని మాదిగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. డిమాండ్ సాధన కోసం ఈ నెల 12న చలో గాంధీభవన్ ముట్టడి చెపట్టనున్నట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులు రాపోలు రాములు, పిడమర్తి రవి, గజ్జెల కాంతం తదితరులు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాదిగలకు తీరని అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రజాపాలనలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం, తెలంగాణ మాదిగ జేఏసీ, తెలంగాణ దళిత బహుజనసంఘం, మహా ఎమ్మార్పీఎస్, తెలంగాణ దళిత దండు, తెలంగాణ మాదిగహక్కుల దండోరా సంఘాలు పాల్గొన్నాయి.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రాధారాణి

మహిళలు స్వయం లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి

ఖైరతాబాద్, మార్చ్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు కేవలం ఇంటిపనులకే పరిమితం కాకుండా సొంతంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనలతో ముందుకు వెళ్లాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సైఫాబాద్ సామ్రాట్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో ప్రపంచ మహిళా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాధారాణి హాజరయ్యారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ డాక్టర్ చేతన, మాజీ మంత్రి కొండ్రు పుష్ప లీల, ఐఎల్‌పీఏ ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ప్రతినిధులు హేమలత, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో మహిళా సైకాలజిస్టులు, అడ్వాన్స్ సైకాలజికల్ సర్వీస్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

పంజాగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సైకాలజీ ప్రొఫెసర్ పద్మజ అన్నారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అడ్వాన్స్ సైకాలజికల్ సర్వీస్ ఆఫ్ ఇండియా(ఏపీఏ ఇండియా) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళా సైకాలజిస్టులను ఘనంగా సన్మానించారు. ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ పూర్ణిమ నాగరాజ మాట్లాడుతూ.. మహిళల్లో మానసిక బలం ఎక్కువగా ఉంటుందని, ఆటుపోట్లను అధిగమించే నైపుణ్యం ఉంటుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి మాట్లాడుతూ.. ఏపీఏ ఇండియా ఆధ్వర్యంలో మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు డాక్టర్ విశేష్, డాక్టర్ వీరేందర్, ఏపీఏ ఇండియా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణ భరత్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం వస్తే మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధం

జక్కుల మహేశ్వర్‌రెడ్డి


జక్కుల మహేశ్వర్‌రెడ్డి

బోయిన్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే ధ్యేయంగా సేవ చేసుకోవడానికి బీఆర్‌ఎస్ పార్టీ అవకాశమిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనకు అవకాశం ఇస్తే పోటీచేసి గెలుస్తానని మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, రాజకీయం, సంక్షేమంపై అవగాహన ఉన్న తాను ఈ ప్రాంతం ఎంపీగా పోటీచేసి ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఉందన్నారు. రాజకీయ పార్టీ ప్లాట్‌ఫాం ద్వారా తన సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతోనే ఎంపీ ఎన్నికల్లోకి రానున్నానన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికవడానికి సామర్థ్యం తనకుందన్నారు. ఆర్థిక, సామాజిక, సేవ, రాజకీయ అనుభవం ఉన్న తనలాంటి వారిని రాజకీయాల్లోకి రావాలని స్నేహితులు మేధావులు బంధువులు తమ సామాజికవర్గం కోరుతుందన్నారు. ఉన్నత విద్యావంతుడినైన తాను విశ్వసనీయతతో పాటు కంటోన్మెంట్ ప్రాంతానికి చేసిన సేవలకు ప్రజలకు సుపరిచితుడినని చెప్పారు. జనవిజ్ఞానం, బహిరంగ సభలో పాల్గొని నిరంతరం ప్రజల్లో ఉన్నానన్నారు. నీతి, నిజాయితీతో పాటు టీమ్ వర్క్‌పై అపార అనుభవం ఉన్న తనకు అవకాశం వస్తే మరింతగా ప్రజాసేవ చేస్తానన్నారు. ఏదిఏమైనా తాను ప్రజలమీద బతికే నాయకుడిగా కాకుండా ప్రజల కోసం బతికే సేవకుడిగా ఉండాలన్నదే తన ఆశయమని చెప్పారు.

బీజేపీ సికింద్రాబాద్ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా సతీష్‌రాజ్

బౌద్ధనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా వారాసిగూడకు చెందిన వీరబోయిన సతీష్‌రాజ్ నియమితులయ్యారు. ఈమేరకు నియామకపత్రాన్ని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌రాజ్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం కష్టపడి పనిచేస్తామన్నారు. తనకు పదవి కేటాయించిన కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణికి కృతజ్ఞతలు తెలిపారు.


సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు సూర్యనారాయణ, రమావత్ రవి, నాగరాజు, నర్సింహ

ఉరేసుకుంటున్నానంటూ.. డయల్ 100కు ఫోన్

సీపీఆర్ చేసి కాపాడిన పోలీసులు


జగన్‌కు సీపీఆర్ చేస్తున్న పోలీసులు

సరూర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకోవడానికి అంతా సిద్ధం చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్ చేశాడు.. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడకు చేరుకుని కొనఊపిరితో ఉన్న సదరు వ్యక్తిని సీపీఆర్ చేసి కాపాడారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.... బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌కు చెందిన జగన్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. శనివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకోవడానికి సిద్ధపడి డయల్ 100కు ఫోన్ చేశాడు. అక్కడి సిబ్బంది మీర్‌పేట్ పోలీసులకు సమాచారంతో పాటు లొకేషన్‌ను పంపించడంతో కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, రమావత్ రవి, నాగరాజు, హోంగార్డు నర్సింహ సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే జగన్ ఉరేసుకోగా, కిందకు దింపి సీపీఆర్ చేశారు. తరవాత ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని, కోలుకుంటున్నాడని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ చెప్పారు. జగన్‌ను కాపాడిన పోలీసులకు అతడి కుటుంబసభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. రాచకొండ కమిషనర్, ఇతర పోలీసు అధికారులు వారిని అభినందించారు.


గ్లకోమా వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ప్రభాకర్ తదితరులు

సరోజినీదేవి ఆస్పత్రిలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

కార్వాన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం సరోజినీదేవి ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో ఆదివారం ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన చేతులు మీదుగా గ్లకోమా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. సరోజినిదేవి ఆస్పత్రిలో ప్రతీ సంవత్సరం గ్లకోమా వారోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. నీటి కాసుల వ్యాధిపై అందరికీ అవగాహన ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వైరాగ్యం రాజలింగం, ఆసుపత్రి సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిద్ర తగ్గితే పెను ప్రమాదం

రోగ నిరోధక శక్తి తగినంత ఉండేలా చూడడానికి నిద్ర చాలా కీలకం

- డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు
- పిల్లలు, మహిళల్లోనూ నిద్రలేమి సమస్య
- కిమ్స్ ఆస్పత్రిలో నిద్రపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం


నిర్వాహక కమిటీతో డాక్టర్ భాస్కర్ రావు

రాంగోపాల్‌పేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంచి నిద్ర భౌతిక, శారీరక ఆరోగ్యానికి చాలా ముఖ్యమని, అది ఏ మాత్రం తగ్గినా పెను ప్రమాదం సంభవిస్తుందని, జ్ఞాపక శక్తికి, మూడ్ బాగుండటానికి జీర్ణ వ్యవస్థ సక్రమంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తి తగినంత ఉండేలా చూడడానికి నిద్ర చాలా కీలకమని కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు అన్నారు. సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం స్లీప్ స్పెషలిస్ట్, పల్మనాలజిస్టు డాక్టర్ వి.వి.రమణ ప్రసాద్ నేతృత్వంలో నిద్రపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించిన డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ నిద్ర గురించి ఒక ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అందరికీ అవగాహన కల్పించడం ఎంతో ముదావహమని, మనిషి మొత్తం జీవిత కాలంలో మూడో వంతు భాగం నిద్రలోనే గడిపేస్తాడన్న విషయం చాలా మందికి తెలియదన్నారు. అనంతరం డాక్టర్ రమణ ప్రసాద్ మాట్లాడుతూ... ప్రతియేటా నిద్రకు సంబంధించిన వివిధ సమస్యల వల్ల ప్రపంచంలో దాదాపు 90 కోట్ల మంది, భారతదేశంలో 10 కోట్ల మంది ప్రభావితం అవుతున్నారని వివరించారు. వీటిలో ప్రధానమైనది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా (ఓఎస్‌ఏ) అని, పడుకున్నప్పుడు మధ్య మధ్యలో నిద్రాభంగం కలగడం, ఊపిరి సరిగా అందకపోవడం, దీనివల్ల ఉదయం లేచేసరికి కూడా తగినంత నిద్ర లేనట్లు అనిపించడం లాంటివి ఉంటాయని, ఈ సమస్య అందరిలో ఉన్నప్పటికీ ముఖ్యంగా పిల్లలు, మహిళల్లో దీనిని సరిగ్గా గుర్తించడంలేదని వివరించారు. ఓఎస్‌ఏ ప్రభావం రోజువారీ జీవితంతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుందని, దీని వల్ల సడన్ కార్డియక్ అరెస్టులు, పక్షపాతం, గుండెలయ తప్పడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కునుకు పట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు వంటి తీవ్రమైన ముప్పులు ఉంటాయన్నారు. ఎవరికైనా ఉదయం లేచిన తరువాత కూడా మూడ్ సరిగా లేకపోవడం, ఏ పని చేయాలనిపించక పోవడం, బద్ధకంగా ఉండడం లాంటివి ఉంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి తమ నిద్ర నాణ్యతను పరీక్షించుకోవాలని సూచించారు.

దీనికి కూడా కొన్ని చికిత్సలు ఉన్నాయన్న విషయం చాలామందికి తెలియడంలేదని, నిజానికి కొంత మంది వైద్యులకు కూడా దీనిపై సరైన దృష్టి సారించడంలేదన్నారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులుగా డాక్టర్లు లతాశర్మ, మన్మధరావు, విశాల్, మహేష్, జీవీ లక్ష్మీ, చిరాలీ షా, క్రాంతి కుమార్ వ్యవహరించారు.

రాష్ట్రపతి నిలయంలో మహిళా దినోత్సవం


మహిళా రచయితలు


విద్యుత్ కాంతులతో ఫౌంటేన్

తిరుమలగిరి మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మూడురోజుల పాటు జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 200 మంది మహిళా సంస్కృత నుంచి ఉర్దూ భాష వరకు 8 భాషలకు చెందిన 70 నుంచి 80 వరకు రచనలను లిటరరీ ఫెస్టివల్‌లో వినిపించారు. అదేవిధంగా మూడు తరాలకు చెందిన రచనలను వినిపించారు. చేనేత, హస్తకళల ప్రదర్శనను కూడా ఆసక్తిగా తిలకించారని నిలయం అధికారిని రజనీప్రియ తెలిపారు.

రాష్ట్రపతి నిలయం అందాలు చూడతరమా..

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం అందాలు చూడతరమా అనే విధంగా మెరిసిపోతుంది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు పొడిగించడం జరిగింది. దీంతో వారాంతంలో సందర్శకులు అధికంగా విచ్చేస్తున్నారు. రాష్ట్రపతి నిలయంలో భవనాలు, ఫౌంటేన్, ఉద్యానవనాలు విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ మధ్యకాలంలో వారాంతంలో 7 గంటల వరకు పొడిగించారు. సాయంత్రం వేల కుటుంబాలతో కలిసి రాష్ట్రపతి నిలయం అందాలు తిలకించవచ్చని నిలయం అధికారిని రజనీప్రియ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి


మహిళా సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు


మేడిబావి ఆర్యసమాజంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తార్నాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో మహిళలు పోటీతత్వాన్ని అలవర్చుకుని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో వంజరి కులస్థుల మహిళా సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ముఖ్య అతిథిగా హాజరయి మహిళలను ఉద్దేశించి ప్రసగించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కంధారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, వంజరి ముత్యాలు, సునీత, అనురాధ, దేవిక, ఆలే గీత, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు వెలుగు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అండగా ఉంటాం : మందకృష్ణమాదిగ


బీదలబస్తీ సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

బౌద్ధనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు వెలుగు వస్తుందని, కొన్ని సంవత్సరాల నుంచి మాదిగలకు అండగా ఉంటున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి మాదిగలు అండగా ఉంటారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం సాయంత్రం సీతాఫల్‌మండి బీదలబస్తీ ప్లేగ్రౌండ్‌లో మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవటంతో విద్యా ఉద్యోగ అవకాశాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. డెబ్బై సంవత్సరాల ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు నూటికి తొంభైశాతం మాలలకే దక్కాయన్నారు. ఈనేపథ్యంలో ముప్ఫై ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాదిగల కోసం హైదరాబాద్ సభకు వచ్చి ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇవ్వటం సంతోషకరమన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డిని మాదిగలు గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు మాదిగల ఓట్ల కోసం కపట నాటకాలాడుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను మాదిగలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు బొర్ర బిక్షపతి మాదిగ, జిల్లా ఇన్‌చార్జి ఇనుముల నర్సయ్య, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికారప్రతినిధి కొమ్ముశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు నందారం సీతారాంమాదిగ పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే ఉన్నతస్థాయికి..

- ఈటల రాజేందర్


కార్ఖానాలో మేధావులతో ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి తనకు మల్కాజిగిరితో సంబంధమేంటని అంటున్నారని.. తాను ఒక కులానికో, ప్రాంతానికో, మతానికో సంబంధించిన వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డగా, ప్రజల ఆశీర్వాదంతో ఉన్నత స్థాయికి వచ్చినవాడినని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం కార్ఖానాలో ఆదివారం మేధావులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీఎం మాటలపై ఆయన స్పందించారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వారికి ముందుంది ముసళ్ల పండగ అని అన్నారు. నా రాజకీయ జీవితంలో ఏ నాయకుడిపై, ఏ పార్టీపై వ్యక్తిగత దూషణలు చేయలేదని, సంస్కారం ఉన్న వాడినని అన్నారు. రాజకీయ నాయకులు ఉన్నతంగా ఉండాలని, సంకుచితంగా ఉండే వాళ్లు నాయకులు కాదన్నారు. చిన్న, కురస నాయకుల గురించి మాట్లాడనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలై ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. మల్కాజిగిరిలో సమస్యల పరిష్కారం కోసం వచ్చానని పేర్కొన్నారు. నగరంలో ఫ్లైఓవర్‌లన్నీ కేంద్ర నిధులతో నిర్మిస్తున్నవేనని ఆయన అన్నారు.

సంకీర్ణ ప్రభుత్వాలకు ఆస్కారం లేదు

మారేడ్‌పల్లి : సంకీర్ణ ప్రభుత్వాలకు ఆస్కారం లేదని మాజీ మంత్రి బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మహేంద్రహిల్స్ త్రిమూర్తికాలనీలో సీనియర్ నాయకులు వి.నర్సింగ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 273 సీట్లు ఇచ్చి సంకీర్ణ రాజకీయాల శిఖరానికి పాతర వేసి ఒక స్టేబుల్ గవర్నమెంట్ అందించిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన ఘనత, అయోధ్య రామమందిర నిర్మాణంలో నరేంద్ర మోదీ చట్టాలను, వర్గాలను గౌరవిస్తూ, తీసుకున్న నిర్ణయం ప్రపంచ దేశాలు సైతం ప్రశంసించాయని ఆయన తెలిపారు. కరోనా తొలిదశలో మహేంద్రహిల్స్ నివాసికి రావడం కలకలం రేపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ సమయంలో తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి రాష్ట్రానికి అనేక సేవలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు శ్రీగణేష్, వి.నర్సింగరావు, శంకర్, విజయానంద్, భానుక మల్లికార్జున్, వీరయ్య, డాక్టర్ బీబీ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీకి దేశప్రగతి ప్రయోజనాలు ముఖ్యం

కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలు సంక్షేమం కోరుతూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ పరిధిలో ఈస్ట్‌మారేడుపల్లి అంబేద్కర్‌నగర్ బస్తీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు గణేశ్, భానుకమల్లికార్జున్, పిట్లనగేశ్ ముదిరాజ్, వీరయ్య, వీరవర్ధన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జవ్వాది కార్తీక్‌కు పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్


పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కార్తీక్

అడ్డగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌కు వెంకటరమణ, శ్రీదేవిల కుమారుడు కార్తీక్ శనివారం కిర్గజ్‌స్థాన్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలో కార్తీక్ బంగారు పతకాన్ని సాధించారు. ఆసియా ఓపెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌లో భారత్‌కు రెండు బంగారు పతకాలు సాధించగా ఒకరైన కార్తీక్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. మొదట్లో వైజాగ్ డిఫెన్స్ అకాడమీలోని పుడమి హైస్కూలులో పవర్ లిఫ్టింగ్ ప్రస్థానం మొదలైంది. పవర్ లిఫ్టింగ్ కోచ్ నిఖిల్ శిక్షణలో తెలంగాణ ప్రతినిధిగా వ్యవహరించిన రేణుక ఆధ్వర్యంలో కిర్గిస్తాన్ పోటీలకు సిద్ధమైన కార్తీక్ విభిన్న పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఒక వైపు చదువుకుంటూ మరో వైపు క్రీడారంగంలో రాణించడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందని కార్తీక్ ఆనందం వ్యక్తం చేశాడు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

టీ.ఎన్.శ్రీనివాస్

సికింద్రాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీనివాస్ అన్నారు. అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం కంటోన్మెంట్ 2వ వార్డులోని రసూల్‌పురా బస్తీల్లో అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున ఆయా ఆలయాలు, భక్త మండళ్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శ్యామ్‌రెడ్డి, లక్ష్మణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో జంపన ప్రతాప్

దాతలు సహాయ సహకారాలు అందించాలి

బోయిన్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా బోయిన్‌పల్లి బాపూజీనగర్ శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయంలో గత కొన్ని యేండ్లుగా అన్నదాన కార్యక్రమం చేస్తున్నట్లు, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జంపన ప్రతాప్ పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త సుమిత్రానాథ్ ఆమె జ్ఞాపకార్థం వారి కుమారులు అనిల్, సునీల్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని జంపన ప్రతాప్ ప్రారంభించారు. కార్యక్రమంలో విదుర్, సంజన, ఆలయ కమిటీ సభ్యులు అజిత్‌కుమార్, పుట్టి నరసింహ, రామారావు, కాంత్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయం వద్ద జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జాజుల విఠల్‌రావు, విజయలక్ష్మి, సాయి, క్రాంతి, హరిహంత్, జనపాల శేఖర్, నర్సింగ్‌రావు, వినీత్, శివ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న మాజీ సభ్యులు శ్యామ్‌కుమార్, భాగ్యశ్రీ

లాల్‌బజార్ మహంకాళీ దేవాలయంలో..

తిరుమలగిరి మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి మహంకాళి అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్ సహకారంతో దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రతీ అమావాస్యకు అన్నదాన కార్యక్రమం చేస్తామని నిర్వహకులు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం అమావాస్య సందర్భంగా అన్నదాన అన్నదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీ శంకర్, బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, పి.రాజు, ఎస్‌బి.అశోక్, రాజారెడ్డి, వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దుర్గా ప్రసాద్, జిత్తు భాయ్, రామ్ చందర్, శ్రీమతి గీతా యశ్వంత్ కుమార్, పద్మావతిలు పాల్గొన్నారు.

7,150 మంది పిల్లలకు గుండె సర్జరీలు

హృదయ ఫౌండేషన్‌ను అభినందించిన జయేష్‌రంజన్


చిన్నారులతో ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు గుండె సర్జరీలో చేయూత అందిస్తున్న హృదయ ఫౌండేషన్‌ను కార్పొరేట్లు, ఐటీ కార్పొరేట్ రంగాలు ప్రోత్సహించాలని ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. టీ హబ్ వద్ద శనివారం రాత్రి హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,150 సర్జరీలను పూర్తి చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి వ్యవస్థీకృత మద్దతు అందించడం అవసరమన్నారు. 2005లో 'హృదయ క్యూర్ ఎ లిటిల్ హార్ట్'ను డాక్టర్ గోపీచంద్ మన్నంతో పాటు ఇతర భావాలు గల వ్యక్తులు స్థాపించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఖైరాజ్‌కుమార్, డాక్టర్ నాగార్జున పొనుగోటి నేతృత్వంలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడే వారందరికీ సహకరిస్తున్నారన్నారు. హృదయ ఫౌండేషన్, స్టార్, ఇన్నోవా ఆస్పత్రుల్లో 7,150 మందికి పైగా పిల్లలకు వైద్య చికిత్సలు పొందేందుకు సహాయం చేసిందన్నారు.